క్లుప్తంగా

పెండింగ్‌లో ఉన్న డీఏలు ఇవ్వాలి



మాట్లాడుతున్న ఆంజనేయులు

నల్లగొండ టూటౌన్ : పెండింగ్‌లో ఉన్న పెన్షనర్ల మూడు డీఏలను ఎన్నికల కమిషనర్ అనుమతితో వెంటనే ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఆంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం నల్లగొండ పట్టణంలోని పెన్షనర్స్ భవన్‌లో నిర్వహించిన సంఘం మండల కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పెన్షనర్ల సమస్యల పట్ల ప్రభుత్వం సానుకూలంగా వ్యవహరించాలని కోరారు. ఈ నెల 30న జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతిఒక్కరు తమ ఓటు హక్కు వినియోగించుకుని ప్రజాస్వామ్యాన్ని కాపాడాలన్నారు. ఈ సమావేశంలో సంఘం మండల అధ్యక్షుడు గజవెల్లి సత్యం, యాద వాసుదేవ్, జెల్ల పుల్లయ్య, సుధాకర్, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బేటీ బచావో- బేటీ పడావో



చిట్యాలలో ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

చిట్యాల : ఐసీడీఎస్ ఆధ్వర్యంలో చిట్యాల మున్సిపాలిటీ, వెలిమినేడు గ్రామంలో మంగళవారం బేటీ బచావో-బేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమ జిల్లా కో ఆర్డినేటర్ ఝాన్సీరాణి మాట్లాడుతూ లింగ వివక్ష నిర్మూలనకు ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో అంగన్‌వాడీ టీచర్‌లు శ్రీదేవి, అరుణ, అండాలు, పద్మ, సునిత, ధనలక్ష్మి, నాగేంద్రమ్మ పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో అన్నప్రాసన



శివన్నగూడలో చిన్నారులకు అన్నప్రాసన చేస్తున్న అంగన్‌వాడీ టీచర్

మర్రిగూడ : మండల పరిధిలోని లెంకలపల్లి, శివన్నగూడ అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం చిన్నారులకు అంగన్‌వాడీ టీచర్లు అన్నప్రాసనతోపాటు అక్షరాభ్యాసం చేయించారు. ఆయా కార్యక్రమాల్లో అంగన్‌వాడీ టీచర్లు అయితగోని అండాలు, చిట్యాల సువర్ణ, బాలింతలు, గర్భిణులు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

'13న దీపావళి నోములు, వ్రతాలు జరుపుకోవాలి'

శాలిగౌరారం : ఈ నెల 13న (సోమవారం) దీపావళి నోములు, వ్రతాలు జరుపుకోవాలని శాలిగౌరారం మండల వైదిక బ్రాహ్మణ పరిషత్ ప్రతినిధులు తెలిపారు. మంగళవారం వారు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 12న ఆదివారం నరక చతుర్ది సందర్భంగా తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు మంగళ హారతులు, ధనలక్ష్మి పూజలు, దైవ దర్శనం, పండుగ వేడుకలు జరుపుకోవాలన్నారు. అదే విధంగా 13న సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు కేదారేశ్వర గౌరీవ్రతాలు, నోములు జరుపుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో వైదిక బ్రాహ్మణ పరిషత్ ప్రతినిధులు రామడుగు వెంకటరామశర్మ, వావిలాల వేణునాథశర్మ, రామలింగయ్యశర్మ, కొడవటికంటి సుబ్రహ్మణ్యశర్మ, వెంకటేశ్వరశర్మ, పులి రామకృష్ణశర్మ, లక్ష్మీనర్సింహశర్మలు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు పలువురి రాజీనామా

మునుగోడు : బీఆర్‌ఎస్ పార్టీకి మునుగోడు మండలానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు మంగళవారం రాజీనామా చేశారు. స్థానిక ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడి విధానాలు నచ్చక తాము పార్టీకి రాజీనామా చేస్తున్నామని వారు పేర్కొన్నారు. ఏ పార్టీలో చేరుతామనేది త్వరలో నిర్ణయం తీసుకుంటామన్నారు. రాజీనామా చేసినవారిలో మునుగోడు వైఎస్ ఎంపీపీ అనంత వీణలింగస్వామి, చల్మెడ ఉప సర్పంచ్ గాదెపాక లక్ష్మి, పీఏసీఎస్ డైరెక్టర్ కొంక జ్యోతిశ్రీనివాస్, వేమిరెడ్డి జితేందర్ రెడ్డి, చల్మెడ గ్రామశాఖ అధ్యక్షుడు పగిళ్ల శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిక

నల్లగొండ : నల్లగొండ మండలం దీపకుంట గ్రామంలో బీఆర్‌ఎస్ పార్టీకి ఇద్దరు వార్డు మెంబర్లతో పాటు 50 మంది కార్యకర్తలు, మహిళలు మంగళవారం కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు గోపగాని మాధవి, కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. నల్ల గొండ జెడ్పీటీసీ వంగూరు లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న నామినేషన్ల స్వీకరణ

- నల్లగొండలో ఐదుగురు..
- నకిరేకల్‌లో నాలుగు..
- మునుగోడులో రెండు నామినేషన్లు

నల్లగొండ : నల్లగొండ అసెంబ్లీ నియోజకవర్గానికి మంగళవారం ఐదుగురు అభ్యర్థులు నామినేషన్లు సమర్పించారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా కోమటి రెడ్డి వెంకట్‌రెడ్డి, ధర్మ సమాజ్ పార్టీ అభ్యర్థిగా పుల్లెంల శంకరయ్య నామినేషన్ వేశారు. స్వతంత్ర అభ్యర్థులుగా జనిగల రాములు, సయ్యద్ అఫ్రోజ్, మారం వెంకటరెడ్డి నామినేషన్ పత్రాలు సమర్పించారు.

నకిరేకల్‌లో నాలుగు నామినేషన్లు

నకిరేకల్ : నకిరేకల్ ఆర్‌ఓ కార్యాలయంలో మంగళవారం నాలుగు నామినేషన్లు దాఖలయ్యాయి. బీఎస్పీ అభ్యర్థి మేడి ప్రియదర్శిని, బీఎల్‌ఎఫ్ అభ్యర్థి నూనె వెంకటస్వామి, ఇండిపెండెంట్ అభ్యర్థిగా దైద రవీందర్ రెండేసి చొప్పున సెట్లు నామినేషన్లు వేశారు. ఇండిపెండెంట్లుగా మేడి నరేష్, చెరుకుపల్లి రామలింగయ్య, గంటెపాక సాయి తమ నామినేషన్లను ఎన్నికల రిటర్నింగ్ అధికారి పాటిల్ హేమంత్ కేశవ్‌కు అందజేశారు. ఇప్పటివరకు మొత్తం 10 మంది అభ్యర్థులు 14 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారని ఎన్నికల రిటర్నింగ్ అధికారి పాటిల్ హేమంత్ కేశవ్ తెలిపారు.

మునుగోడులో రెండు నామినేషన్లు

చండూరు : మునుగోడు అసెంబ్లీ నియోజకవర్గానికి మంగళవారం రెండు నామినేషన్లు దాఖలయ్యాయి. అర్రూరి రమేష్, స్వతంత్ర అభ్యర్థి(నకిరేకల్ మండలం శివాజీనగర్), కె.శివకుమార్ యుగ తులసీ పార్టీ (హైదరాబాద్, గన్‌ఫౌండ్రీ) నామినేషన్ పత్రాలను ఆర్‌ఓ దామోదర్‌రావుకు అందజేశారు. ఇప్పటివరకు మునుగోడు నియోజకవర్గంలో మొత్తంగా 11 మంది 13 నామినేషన్లు దాఖలు చేశారు.



నల్లగొండ : ఆర్‌ఓకు నామినేషన్ అందజేస్తున్న ధర్మ సమాజ్ పార్టీ అభ్యర్థి పుల్లెంల శంకరయ్య



నల్లగొండ : నామినేషన్ దాఖలు చేస్తున్న ఇండిపెండెంట్ అభ్యర్థి జనిగల రాములు



నల్లగొండ : నామినేషన్ పత్రాలు అందజేస్తున్న ఇండిపెండెంట్ అభ్యర్థి సయ్యద్ అఫ్రోజ్



నల్లగొండ : నామినేషన్ అందజేస్తున్న ఇండిపెండెంట్ అభ్యర్థి మారం వెంకటరెడ్డి



నకిరేకల్ : ఆర్‌ఓకు నామినేషన్ పత్రాలు అందజేస్తున్న ఇండిపెండెంట్ అభ్యర్థి దైద రవీందర్

బీజేపీకి శేపూరి రవీందర్ రాజీనామా



రాజీనామా పత్రాలను చూపుతున్న శేపూరి రవీందర్ తదితరులు

చిట్యాల : మున్సిపల్ కేంద్రానికి చెందిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శేపూరి రవీందర్ బీజేపీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. చిట్యాలలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తనకు నకిరేకల్ ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం ఇవ్వనందుకు నిరసనగా పదవులకు, పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. ఆయనతోపాటు బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు పల్లపు బుద్ధుడు, నకిరేకల్ నియోజకవర్గ బీజేపీ సోషల్ మీడియా కన్వీనర్ చెరుకు లింగస్వామి, ఎస్సీ మోర్చా జిల్లా కార్యదర్శి చేపూరి రాజు, యిమ్మడి విజయ్‌తోపాటు మరో యాభై మంది పార్టీకి రాజీనామా చేశారు. ఏ పార్టీలో చేరేది త్వరలో చెబుతామని వారు తెలిపారు.

బూత్ లెవల్ అధికారులకు శిక్షణ



మాట్లాడుతున్న కమిషనర్ రామదుర్గారెడ్డి

చిట్యాల : ఎన్నికల ప్రక్రియలో భాగంగా బూత్ లెవల్ అవేర్‌నెస్ శిక్షణ కార్యక్రమాన్ని చిట్యాల మున్సిపాలిటీ కేంద్రంలో మంగళవారం మున్సిపల్ శాఖ అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మందడి రామదుర్గారెడ్డి, మెప్మా పీడీ కర్ణాకర్ మాట్లాడుతూ ప్రతి పోలింగ్ బూత్‌లో ఓటర్లకు సహకారం అందించే వలంటీర్లకు ఎన్నికల ప్రక్రియపై అవగాహన ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మెప్మా డీఎంసీ శివాజీ, ఏడీఎంసీ సరిత, ఆర్‌పీలు పాల్గొన్నారు.

బీజేపీలో పలువురి చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న చలమల్ల కృష్ణారెడ్డి

మునుగోడు : మండలంలోని ఊకొండి, రత్తిపల్లి, కిష్టాపురం గ్రామాలకు చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం బీజేపీ రాష్ట్ర నాయకుడు చలమల్ల కృష్ణారెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. పార్టీలో చేరినవారిలో ఊకొండి గ్రామశాఖ అధ్యక్షుడు కొయ్యడి మధు, శ్రీశైలం యాదవ్, బోయపల్లి శ్రీను, సిద్దగోని దశరథ, బొమ్మగోని ఆంజనేయులు, లింగస్వామి, రామచంద్రం, సురిగి వెంకటరమణ, నజీర్ బాబాలతోపాటు మరో 50 మంది ఉన్నారు. ఈ కార్యక్రమంలో సురిగి నర్సింహగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న కంచర్ల భూపాల్‌రెడ్డి

రామగిరి(నల్లగొండ): తిప్పర్తి మండలంలోని గంగన్నపాలెంలో మర్రి మదన్, మర్రి శ్రీనివాస్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు మంగళవారం నల్లగొండ నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కంచర్ల భూపాల్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పల్‌రెడ్డి రవీందర్‌రెడ్డి, వనపర్తి నాగేశ్వరరావు, లోడంగి గోవర్ధన్, కందుల లక్ష్మయ్య, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిస్టులను కించపరిచేవారికి బుద్ధిచెప్పాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి



మాట్లాడుతున్న ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి

మునుగోడు : అనునిత్యం పేద ప్రజల హక్కుల సాధన కోసం ఉద్యమాలు చేస్తున్న కమ్యూనిస్టులను ఇతర పార్టీల నాయకులు కించపరుస్తున్నారని, ఆ నాయకులకు ఈ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి కార్యకర్తలకు సూచించారు. మంగళవారం మునుగోడు మండలంలోని కల్వకుంట్ల గ్రామంలో నిర్వహించిన సీపీఎం గ్రామశాఖ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ పార్టీలు ఎన్నికల సమయంలో అనేక హామీలు ఇచ్చి గెలిచిన అనంతరం విస్మరిస్తున్నాయన్నారు. ఈ నెల 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో కమ్యూనిస్టులు మద్దతు పలికిన అభ్యర్థులకు ఓట్లువేసి గెలిపించాలన్నారు. నల్లగొండ జిల్లా కమ్యూనిస్టుల అడ్డా అని, కమ్యూనిస్టులను కించపరిచేలా మాట్లాడితే ఓట్ల ద్వారా తగిన బుద్ధి చెబుతామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బండా శ్రీశైలం, మండల కార్యదర్శి మిర్యాల భరత్, సహాయ కార్యదర్శి వరికుప్పల ముత్యాలు, ఐతగోని యాదయ్య, నారగోని నర్సింహ, బొందు పెద్ద అంజయ్య, సింగపంగ గౌరయ్య, బయ్యా మల్లయ్య, చిన్న నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా జాతీయ రహదారి

- ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు



పెర్కకొండారం గ్రామ సమీపంలో కుంగిన జాతీయ రహదారి

శాలిగౌరారం : మండలంలోని వంగమర్తి, మాధారంకలాన్, పెర్కకొండారం గ్రామాల మీదుగా నిర్మించిన 365వ నంబర్ జాతీయ రహదారి పెర్కకొండారం గ్రామ పరిధిలో కొంతమేర కుంగిపోయింది. రహదారి కుంగిన ప్రాంతంలో సుమారు కిలోమీటరు పొడవు ఎలాంటి మలుపులు లేకపోవడతో వాహనాలు గరిష్ట వేగంతో వెళుతుంటాయి. దీంతో జాతీయ రహదారిపై వెళ్లేవాహనదారులు రహదారి కుంగిన ప్రదేశంలో వేగ నియంత్రణ కాకపోవడం వల్ల ప్రమాదాలకు గురవుతున్నారు. కుంగిన రహదారి ప్రదేశంలో ఇప్పటికే ఒకదఫా ప్యాచ్ వర్క్ కూడా చేశారు. కానీ నాణ్యతాలోపంతో పనులు చేయడంతో సీసీప్యాచ్ కూడా పూర్తిగా ధ్వంసమైపోయింది. కుంగిన జాతీయ రహదారిపై పటిష్టంగా మరమ్మతులు చేసి ప్రమాదాలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని వాహనదారులు సంబంధిత అధికారులను కోరుతున్నారు. కాగా మహారాష్ట్రంలోని సిరోంచ నుంచి తమిళనాడు రాష్ట్రంలోని యేర్పడు వరకు ఏర్పాటు చేసిన ఈ జాతీయ రహదారిని నకిరేకల్‌లోని హైదరాబాద్-విజయవాడ 65వ నెంబర్ జాతీయ రహదారి మీదుగా తానంచర్ల వరకు రూ. 298 కోట్ల వ్యయంతో 66.53 కిలోమీటర్ల పొడవు పూర్తిగా సీసీతో పైలట్ ప్రాజెక్టు రహదారిగా నిర్మించారు.

ఎన్నికల ముందు పార్టీ మారడం అవివేకం



మర్రిగూడ : మాట్లాడుతున్న ఎంపీపీ మోహన్‌రెడ్డి

మర్రిగూడ : బీఆర్‌ఎస్ పార్టీ ద్వారా పదవులు పొంది ఐదేళ్ల పదవులను అనుభవించి ఎన్నికల ముందు పార్టీ మారడం అవివేకమని మర్రిగూడ ఎంపీపీ మెండు మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మర్రిగూడ మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మునుగోడు నియోజకవర్గంలో పలు మండలాల బీఆర్‌ఎస్ నాయకులు పార్టీకి రాజీనామా చేయడం బాధాకరమన్నారు. తరువాతి క్యాడర్ మరింత బలపడే విధంగా చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తోటకూరి శంకర్, మాల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దంటు జగదీశ్వర్, సర్పంచ్ నల్ల యాదయ్య, కల్లు నవీన్‌రెడ్డి, ఆకులవరం లక్ష్మారెడ్డి, ఎడ్ల శ్రీరాములు, అంతిరెడ్డి, మారగోని వెంకటయ్య, కొంపల్లి నాగరాజు, ఎడ్ల రవి, మామిడి కృష్ణ, చాంద్‌పాషా, బీరప్ప, నర్సింహ, రమేష్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు నష్టం లేదు

నాంపల్లి : కొంత మంది స్వార్థపరులు పార్టీకి రాజీనామా చేసినంత మాత్రానా బీఆర్‌ఎస్‌కు నష్టం లేదని నాంపల్లి ఎంపీపీ ఏడుదొడ్ల శ్వేతరవీందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం నాంపల్లిలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. పూటకో పార్టీ మారే నాయకులను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. ఈ సమావేశంలో రైతు బంధు మండల కన్వీనర్ ఏడుదొడ్ల రవీందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గుమ్మడపు నర్సింహారావు, మండల ప్రధాన కార్యదర్శి కొరే యాదయ్య, మీడియా ప్రచార కార్యదర్శి మహ్మద్ సలీమ్, సర్పంచ్‌లు నాగులవంచ శ్రీలత, బల్గూరి విష్ణు, కర్నె యాదయ్య, కర్నాటి మహత్మ, కాటం నర్సింహ, సర్దార్, కృష్ణారెడ్డి, హనుమంత్, కొండయ్య, కొరే కిషన్, సత్తయ్య, గిరి, జెల్లెల్ల సైదులు, సుందర్, జగన్, నగేష్, యాదయ్య తదితరులు ఉన్నారు.

రాజగోపాల్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న రాజగోపాల్‌రెడ్డి

చండూరు : మండల పరిధిలోని గుండ్రపల్లి గ్రామానికి చెందిన పలు పార్టీల నాయకులు మునుగోడు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సమక్షంలో మంగళవారం మునుగోడు క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరినవారిలో నరేష్, మహేందర్, లింగస్వామి, అంజి, శ్రీకాంత్, తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో గుండ్రపల్లి గ్రామశాఖ అధ్యక్షుడు కురుపాటి గణేశ్, ఉపాధ్యక్షుడు కురుపాటి శ్రీను, ఎలవర్తి శ్రీను, కురుపాటి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మర్రిగూడ : మండల పరిధిలోని కొండూరు గ్రామానికి చెందిన పలు పార్టీల కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముద్దం నర్సింహగౌడ్ ఆధ్వర్యంలో మునుగోడు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సమక్షంలో మంగళవారం మునుగోడులో కాంగ్రెస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బేత వెంకటేష్‌యాదవ్, కొట్టం శ్రీనివాస్‌యాదవ్, కారింగు దేవేందర్‌గౌడ్, ఖదీర్ తదితరులు పాల్గొన్నారు.

బైండోవర్ అతిక్రమించిన వ్యక్తికి జరిమానా

మిర్యాలగూడ అర్బన్ : పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన రౌడీషీటర్ ఇంజమూరి కొండల్ బైండోవర్ అతిక్రమించడంతో అతడికి తహసీల్దార్ రూ.లక్ష జరిమానా విధించినట్లు సీఐ రాఘవేందర్ గౌడ్ మంగళవారం తెలిపారు. వివరాల్లోకి .. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కొద్ది రోజుల కిందట కొండల్ తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. ఇటీవల కొండల్ అదే కాలనీకి చెందిన సాయి అనే వ్యక్తిపై దాడి చేశాడు. దీంతో బాధితుడు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన అనంతరం సీఐ రాఘవేందర రౌడీ షీటర్ కొండల్‌ను మంగళవారం తిరిగి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. గత బైండోవర్ అతిక్రమించినందుకు తహసీల్దార్ హరిబాబు కొండల్‌కు రూ.లక్ష జరిమానా విధించినట్లు సీఐ పేర్కొన్నాడు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మిర్యాలగూడ వన్‌టౌన్ సీఐ రాఘవేందర్ అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. నిబంధనల ప్రకారం బైండోవర్‌ను అతిక్రమిస్తే రూ. లక్ష రూపాయల నుంచి మూడు లక్షల రూపాయల వరకు జరిమానా విధించడంతో పాటు ఒక సంవత్సరం జైలు శిక్ష విధించే అవకాశం ఉందని హెచ్చరించారు. ఎవరైనా రౌడీ కార్యకలాపాలకు పాల్పడుతూ శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే డయల్ 100 కు గాని, సంబధిత పోలీస్ స్టేషన్‌కు గానీ సమాచారం అందించాలని సూచించారు.

హనుమాన్ దీక్ష మాలధారణ వాల్ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మహేష్

నాంపల్లి : హనుమాన్ శక్తి జాగరణ సమితి మండల శాఖ ఆధ్వర్యంలో హనుమాన్ దీక్ష మాలధారణ వాల్ పోస్టర్‌ను మంగళవారం మండల కేంద్రంలోని బ్రహ్మంగారి ఆలయ ఆవరణలో సంఘం యువజన విభాగ్ నల్లగొండ జిల్లా ప్రధాన కార్యదర్శి పానగంటి మహేష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ ఈ నెల 14నుంచి 17వరకు చేపట్టే దీక్షను భక్తులు అధిక సంఖ్యలో చేపట్టి హిందూ ఐక్యతను చాటాలన్నారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ శక్తి జాగరణ సమితి మండల అధ్యక్షుడు కర్నాటి గోవర్ధన్, గురుస్వాములు కాటం శంకర్, కొండపల్లి రమేష్, మెగావత్ పాండు, కాటం వెంకటయ్య, కర్నాటి శ్రీహరి, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

మిర్యాలగూడ టౌన్ : యాదాద్రి భువనగిరి జిల్లాలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో అక్టోబరు 13, 14, 15వ తేదీల్లో నిర్వహించిన 9వ జోనల్ లెవల్ గేమ్స్‌లో మిర్యాలగూడ ఎస్సీ గురుకుల పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చాటారు. అండర్ -14 విభాగం ఖో ఖోలో ప్రథమ స్థానం, చెస్‌లో ప్రథమ స్థానం, టెన్నికాయిట్‌లో ద్వితీయ స్థానం, అథ్లెటిక్స్ -200మీటర్ల ద్వితీయ స్థానం, 600మీటర్లలో ద్వితీయ స్థానం, 100మీటర్లల ద్వితీయ స్థానం, హైజంప్‌లో ద్వితీయ స్థానం సాధించినట్లు ప్రిన్సిపాల్ రవీంద్రకుమార్ తెలిపారు. అదే విధంగా అండర్ -17 విభాగంలో బ్యాడ్మింటన్ ఖో ఖో, చెస్‌లో ప్రథమ స్థానం నిలవగా, కబడ్డీలో ద్వితీయ స్థానం సాధించారు. అథ్లెటిక్స్‌లో 5కిలో మీటర్ల విభాగంలో 1500, 800, 400 మీటర్లతో ప్రథమ స్థానం సాధించారని తెలిపారు. అండర్-19 విభాగంలో ఖోఖో, బాల్ బ్యాడ్మింటన్ లో ప్రథమ స్థానం, కబడ్డీలో ద్వితీయ స్థానం, అథ్లెటిక్స్‌లో 1500మీటర్ల విభాగంలో ప్రథమ స్థానం, 800 మీటర్లలో ద్వితీయ, 400 మీటర్లలో ద్వితీయ స్థానంతో పాటు డిస్కస్ త్రోలో ద్వితీయ స్థానం సాధించినట్లు పాఠశాల పీఈటీ గురువయ్య తెలిపారు. ఆయా పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులను పాఠశాల పీడీ లక్ష్మణ్, వైస్ ప్రిన్సిపాల్ రాములు, రవి, రామారావు, శంకర్‌నాయక్, హెల్త్ సూపర్‌వైజర్ భిక్షం, నాగునాయక్, స్వప్న, జానకి, సృజన్ కుమార్, రామలక్ష్మి, అనిల్‌కుమార్, జావిద్, సత్యనారాయణ, శేఖర్‌లు ప్రత్యేకంగా అభినందించారు.

మిర్యాలగూడ కాంగ్రెస్ టికెట్ బీసీకి కేటాయించాలి

నల్లగొండ : మిర్యాలగూడ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ టికెట్ బీసీకి కేటాయించాలని కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు గోపగాని మాధవి కోరారు. నల్లగొండలో మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. రాహుల్ గాంధీ ఉదయపూర్‌లో చెప్పిన విధంగా ప్రతి పార్లమెంట్ నియోజకవర్గంలో రెండు అసెంబ్లీ స్థానాలను బీసీలకు కేటాయించే విధంగా అమలు చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు.

సోలార్ లైట్ల నిర్వహణలో నిర్లక్ష్యం

- పలు గ్రామాల కూడళ్లల్లో గతంలో ఏర్పాటు
- కొన్నిచోట్ల బ్యాటరీలను ఎత్తుకెళ్లిన దుండగులు
- పట్టించుకోని అధికారులు

చిట్యాల : గ్రామాల్లోని వీధుల్లో ఏర్పాటు చేసే స్ట్రీట్ లైట్స్‌కు ఏడాదికి లక్షల్లో విద్యుత్ బిల్లులు చెల్లించాల్సి ఉంటుంది. ఒక్కోసారి గ్రామ పంచాయతీలకు వచ్చే కొద్దిపాటి ఆదాయంలో ముప్పై శాతం వరకు విద్యుత్ బిల్లులకు చెల్లించాల్సిన పరిస్థితి వస్తోంది. దీంతో సోలార్ లైట్స్ ఏర్పాటు చేసుకుంటే విద్యుత్ బిల్లులు చెల్లించాల్సిన పరిస్థితి తప్పుతుందని పలు గ్రామ పంచాయతీల పాలకవర్గాలు వాటర్ షెడ్ పథకం ద్వారా సోలార్ స్ట్రీట్ లైట్లను ఏర్పాటు చేసుకున్నాయి. తరువాత నిర్వహణ లేకపోవడంతో సోలార్ స్ట్రీట్ లైట్లు నిరుపయోగంగా మారాయి.

వాటర్ షెడ్ పథకం ద్వారా..

చిట్యాల మండలంలోని గుండ్రాంపల్లి, ఏపూరు గ్రామాల్లో వాటర్‌షెడ్ పథకం ద్వారా మంజూరైన నిధులతోపాటు కొందరు గ్రామస్తులు స్వచ్ఛందంగా అందించిన ఆర్థిక సహకారంతో సోలార్ స్ట్రీట్స్ లైట్స్‌ను నాలుగేళ్ల క్రితం ఏర్పాటు చేశారు. గుండ్రాంపల్లి గ్రామంలో 16, ఏపూరు గ్రామంలో 15 సోలార్ స్ట్రీట్స్ లైట్స్‌ను ఆయా గ్రామాల్లోని ముఖ్య కూడళ్లలో, ఆలయాల వద్ద ఏర్పాటు చేశారు. ఇవి ప్రారంభంలో కొన్నేళ్ల పాటు బాగానే పనిచేశాయి. దీంతో ఆయా గ్రామపంచాయతీలకు విద్యుత్ బిల్లుల భారం తప్పింది. ఆ తరువాత వాటి నిర్వహణ, మరమ్మతులను సంబంధిత వాటర్‌షెడ్ అధికారులు, గ్రామ పంచాయతీ సిబ్బంది పట్టించుకోలేదు. దీంతో సోలార్ స్ట్రీట్స్ లైట్స్ నిరుపయోగంగా మారాయి.

బ్యాటరీల చోరీ..

సోలార్ స్ట్రీట్స్ లైట్స్ పనిచేసినట్లయితే ఆయా గ్రామ పంచాయతీలు చెల్లించాల్సిన విద్యుత్ బిల్లుల భారం తప్పేది. కానీ వాటి నిర్వహణ బాధ్యత ఎవరు పట్టించుకోకపోవడంతో కొన్ని గ్రామాల్లోని స్ట్రీట్ లైట్స్ సోలార్ బ్యాటరీలను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. బ్యాటరీలు లేకపోవడంతో సోలార్ స్ట్రీట్ లైట్లు పనిచేయడం లేదు. దీంతో ఆయా గ్రామ పంచాయతీల్లో ప్రతియేటా లక్షల రూపాయల్లో విద్యుత్ బిల్లులు చెల్లించాల్సి రావడంతో పాలకవర్గాలకు ఆర్థిక ఇబ్బందిగా మారింది. సంబంధిత శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు తగిన చర్యలు తీసుకుని సోలార్ స్ట్రీట్స్ లైట్స్‌ను వినియోగంలోకి తీసుకువచ్చినట్లయితే ఆయా గ్రామ పంచాయతీలకు ఆర్థికభారం తప్పినట్లవుతుంది.



గుండ్రాంపల్లిలో పీఏసీఎస్ సమీపంలో నిరుపయోగంగా ఉన్న సోలార్ లైట్

మరమ్మతులు చేపట్టాలి



గుండ్రాంపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన సోలార్ స్ట్రీట్ లైట్స్ నిర్వహణ లేక పనిచేయడం లేదు. వాటర్ షెడ్ పథకం అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి. లేదా గ్రామ పంచాయతీకి నిధులు కేటాయించి వెంటనే మరమ్మతులు చేపట్టాలి. సోలార్ స్ట్రీట్స్ లైట్స్ వాడడం వల్ల గ్రామ పంచాయతీ నిధులు ఆదా చేసినవారం అవుతాం.

– కత్తుల లింగస్వామి, గుండ్రాంపల్లి